క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు


తిరుపతి ఎంపీ గురుమూర్తి


ఎస్ఈబీ డైరెక్టర్ ఆవుల రమేష్‌రెడ్డి

తిరుమల: శ్రీవారిని గురువారం తిరుపతి ఎంపీ గురుమూర్తి, తెలంగాణ ఎమ్మెల్యేలు యాదయ్య, బేతి సుభాష్ రెడ్డి, ఏపీ ఎమ్మెల్యేలు వాసుబాబు, వసంతకృష్ణప్రసాద్, ఎస్ఈబీ డైరెక్టర్ ఆవుల రమేష్‌రెడ్డి దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ


వధువు తండ్రి షేక్ రహీంకు పెళ్లి కానుక అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి, గణపతిరెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని నడవలూరుకు చెందిన షేక్ రహీమ్ కుమార్తెకు వివాహం నిశ్చయమైంది. ఆమెకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను గురువారం వైఎస్సార్ సీపీ నెన్నూరు డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సర్పంచి గణపతిరెడ్డి, నాయకులు బాబు, కుమార్ అందజేశారు.

గంగమ్మ ఆలయానికి రూ.2.01,600 విరాళం


ఆలయ చైర్మన్, ఈవోకు చెక్కు అందజేస్తున్న భక్తురాలు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయ మహా ప్రాకార నిర్మాణానికి తిరుపతికి చెందిన భక్తురాలు గురువారం రూ.2,01,600 విరాళం ఇచ్చారు. ఈ మేరకు చెక్కును ఆమె ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో మునిక్రిష్ణయ్యకు అందజేశారు.

జడ్జిగా ఎంపికైన న్యాయవాదుల కుమారుడు


తేజసాయి

తిరుపతి లీగల్: తిరుపతికి చెందిన సీనియర్ న్యాయవాదులు వి.జయచంద్ర, వి.సుమతి దంపతుల కుమారుడు తేజసాయి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. దీనిపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. తేజసాయి నల్సార్ యూనివర్సిటీలో న్యాయ విద్యను అభ్యసించి 2019లో రాష్ట్ర హైకోర్టులో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 2021లో జూనియర్ సివిల్ జడ్జి పరీక్ష రాసి ఎంపికయ్యారు. ఆయనను జూనియర్ సివిల్ జడ్జిగా నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

ఈఎస్ఐలో రోగులకు సౌకర్యాలు కల్పించాలి


ఈఎస్ఐ రీజనల్ డైరెక్టర్ రాధాకృష్ణను సత్కరిస్తున్న రత్నకుమార్ తదితరులు

తిరుపతి తుడా: తిరుపతిలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో రోగులకు మరిన్ని సౌకర్యాలు, వైద్య సదుపాయాలు కల్పించాలని ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు లేబూరు రత్నకుమార్ కోరారు. ఈఎస్ఐసీ రీజనల్ డైరెక్టర్‌గా రాధాకృష్ణ గురువారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా లేబూరు రత్నకుమార్ రీజనల్ డైరెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆస్పత్రిలో ల్యాబ్ పటిష్టం, తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.

నేత్ర పర్వం.. స్వర్ణ రథోత్సవం


స్వర్ణ రథంపై ఊరేగుతున్న కలియుగ వైకుంఠనాథుడు


స్వామి, అమ్మవార్లకు వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

- కనుల పండువగా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు
- హనుమంత, గజవాహనాలపై శ్రీహరి చిద్విలాసం


నాలుగు మాడ వీధుల్లో గజ వాహనంపై విహరిస్తున్న కల్యాణ వెంకన్న

చంద్రగిరి: మంగళ వాయిద్యాలు.. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి గురువారం స్వర్ణ రథంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు శ్రీనివాసుడు హనుమంత వాహనంపై వెంకటాద్రి రాముడి అవతారంలో భక్తులకు అభయమిచ్చారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పరిణయ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం సాయంత్రం 4 గంటల నుంచి 5 మధ్య దివ్యాభరణ, పట్టుపీతాంబరాలతో అలంకృతులైన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఉత్సవర్లను స్వర్ణ రథంపై అధిష్టింపజేసి అర్చకులు సంకల్ప పూజలు చేశారు. అనంతరం ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, టీటీడీ అధికారులు స్వామి వారి సర్కారు హారతిని అందుకున్నారు. స్వర్ణ రథాన్ని టీటీడీ అధికారులు, భక్తులు నాలుగు మాడవీధుల్లో లాగారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు శ్రీనివాసుడు గజవాహనంపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చాడు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్లు రమణయ్య, చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అనిల్, సీఐ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

శ్రీనివాస మంగాపురం కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శుక్రవారం స్వామి వారు ఉదయం సూర్య, రాత్రి చంద్రప్రభ వాహనాలపై నాలుగు మాడ వీధుల్లో ఊరేగనున్నారు.

వ్యాఘ్ర వాహనంపై సోమస్కందమూర్తి అభయం


వ్యాఘ్ర వాహనంపై ఊరేగుతున్న సోమస్కందమూర్తి, కామాక్షి అమ్మవారు


గజవాహనంపై ఊరేగుతున్న కపిలేశ్వరస్వామి

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం సోమస్కందమూర్తి వ్యాఘ్ర వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. అనంతరం ఆలయంలో కంకణభట్టార్ ఉదయస్వామి ఆధ్వర్యంలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. రాత్రి గజవాహన సేవ కోలాహలంగా సాగింది. భక్తులు అడుగడుగునా స్వామికి కర్పూర నీరాజనాలు పలికారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

రేపు మహాశివరాత్రి వేడుకలు

కపిలేశ్వర స్వామి ఆలయంలో శనివారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా క్యూలు, చలువ పందిళ్లు, పార్కింగ్ ఏర్పాటు చేశారు. మహా శివరాత్రి సందర్భంగా శనివారం తెల్లవారుజామున 2.30 నుంచి 4.30 గంటల వరకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 8 నుంచి 10గంటల వరకు స్వామివారి రథోత్సవం, 10.30 నుంచి 11.30 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటలవరకు నందివాహన సేవలు నిర్వహిస్తారు. ఉదయం 5.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 12 గంటల వరకు భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు. 19వ తేదీ ఆదివారం నాడు తెల్లవారుజామున 12 నుంచి ఉదయం 4 గంటల వరకు లింగోద్భవకాల అభిషేకం చేస్తారు.

19న వేడుకగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం

మహాశివరాత్రి మరుసటి రోజైన ఆదివారం శివ పార్వతుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగనుంది. సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ఆర్జిత సేవగా కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. గృహస్తులు రూ.250లు చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు.

భక్తులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి

చంద్రగిరి: స్థానిక జమండ్లవీధిలోని సీతారామాలయం వద్ద శివస్వామి భక్త బృందం గురువారం అన్నదానం చేపట్టింది. శివ దీక్ష చేపట్టిన భక్తులు శివరాత్రిని పురస్కరించుకుని గురువారం శ్రీశైలం యాత్రకు పయనమయ్యారు. ఈ క్రమంలో ఉదయం ఆలయం వద్ద ఆంజనేయ స్వామి భారీ విగ్రహానికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 250 మందికి అన్నదానం చేశారు. సర్పంచులు వెంకటయ్య, భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీలు దెయ్యాల మాధవరెడ్డి, రాజయ్య, భాస్కర్, నాయకుడు సోనురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



రామచంద్రాపురం: మండలంలోని పారకాల్వ సమీపంలో వెలసిన రాజరాజేశ్వరి దేవి ఆలయంలో గురువారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. యూనియన్ బ్యాంకు చీఫ్ మేనేజర్ మొగిలీశ్వర్, ప్రాజెక్టు ఆఫీసర్ బాలాజీ, రాస్ సిబ్బంది నాగేశ్వర్, మునిరాజ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

తాటితోపు పాఠశాలలో రుషివ్యాలీ తరహా బోధన


అధికారులతో సమీక్షిస్తున్న జేఈవో సదాభార్గవి

తిరుపతి అలిపిరి: తిరుపతి రూరల్ మండలం తాటితోపులోని టీటీడీ ప్రాథమిక పాఠశాలలో వచ్చే ఏడాది నుంచి రిషి వ్యాలీ తరహా బోధన ప్రారంభించాలని జేఈవో సదా భార్గవి ఆదేశించారు. ఆమె గురువారం పద్మావతి విశ్రాంతి గృహంలో టీటీడీ విద్యా సంస్థలపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రుషివ్యాలి తరహాలో శిక్షణ ఇవ్వాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు చేపట్టాలన్నారు. ప్రతి పాఠశాలలోనూ మౌలిక వసతులు కల్పించాలన్నారు. టీటీడీ విద్యా సంస్థల్లో చదివి ప్రస్తుత ఐఐటీలో చదువుతున్న విద్యార్థి మహర్షి సాగర్ తదితరులతో అన్ని విద్యా సంస్థల్లో వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించాలని సూచించారు. 100 శాతం ఫలితాలు సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అన్ని విద్యాసంస్థల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయాలని, ప్రతి కళాశాల, పాఠశాలకు వెబ్‌సైట్ ఏర్పాటు చేయాలన్నారు. డీఈవో భాస్కర్‌రెడ్డి, ఐటీ జీఎం సందీప్, ఈఈలు మనోహర్, వేణుగోపాల్, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్, విద్యుత్ విభాగం డీఈ సరస్వతి పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం


చంద్రగిరి: ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి అధ్యక్షతన శనివారం ఉదయం సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

109 మంది ఎస్‌డీహెచ్ఆర్ విద్యార్థులకు ఉద్యోగాలు


విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌డీహెచ్ఆర్ కళాశాల చైర్మన్ డీవీఎస్.చక్రవర్తిరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి న్యూబాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 109 మంది వివిధ ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించినట్లు చైర్మన్ డీవీఎస్.చక్రవర్తిరెడ్డి తెలిపా రు. కళాశాలలో గురువారం ఏజీఎస్ హెల్త్, గ్లోబల్ లాజిక్ సంస్థ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న 32 మంది ఏజీఎస్ హెల్త్, 77 మంది విద్యార్థులు గ్లోబల్ లాజిక్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. వారిని డీవీఎస్. చక్రవర్తిరెడ్డి అభినందించారు.

ఎర్రచందనం స్వాధీనం


నిందితుడి అరెస్ట్ చూపుతున్న అటవీ అధికారులు

భాకరాపేట: ఎర్రచందనం స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు భాకరాపేట ఫారెస్టు రేంజర్ దత్తాత్రేయ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. తలకోన సెంట్రల్ బీటు పరిధిలోని ఎర్రనీళ్ల వంక సమీపంలో ఎర్రచందనం దుంగలను తీసుకొస్తున్న స్మగ్లర్లను పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయారని తెలిపారు. చిత్తూరు జిల్లా సోమల మండలానికి చెందిన శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. 109 కిలోల బరువుగల మూడు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.80 వేలు ఉంటుందన్నారు. ఎఫ్ఎస్ఓ సల్లావుద్దీన్, సిబ్బంది ప్రదీప్‌చాంద్, రాజేష్, నిఖిల్, శంకర్ పాల్గొన్నారు.

రూ.80 కోట్లతో సిటీ ఆపరేషన్ సెంటర్


భవన నిర్మాణంపై ఆరా తీస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి స్మార్ట్ సిటీలో భాగంగా రూ.80 కోట్లతో సిటీ ఆపరేషన్ సెంటర్ నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్టు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. ఆమె గురువారం తొలగించిన పాత మున్సిపల్ కార్పొరేషన్ స్థలాన్ని పరిశీలించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ తిరుపతి నగరానికి తలమానికంగా ఎదిగేలా రూ.80 కోట్లతో నూతన భవనాన్ని సరికొత్త హంగులతో నిర్మిస్తున్నట్టు చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. పనులను నిర్లక్ష్యం చేస్తే సంబంధిత అధికారులు, గుత్తేదారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈఈ దేవిక, ఎయికామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల పరిశీలన

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లబ్ధిదారులకు కేటాయించిన వడమాలపేట మండలం కల్లూరు లేఔట్‌ను కమిషనర్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పూర్తయిన ఇళ్లలో ఉగాది నాటికి గృహ ప్రవేశం చేయించేలా ఇంజినీర్లు చొరవ తీసుకోవాలన్నారు. మున్సిపల్ ఇంజినీర్లు వెంకట్రామరెడ్డి, హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు, హౌసింగ్ డీఈ మోహన్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్ట్ మృతి

భాకరాపేట : తిరుపతి–పీలేరు జాతీయరహదారి మార్గంలోని రాజువారిపల్లె మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్ట్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం.. గురువారం రాత్రి అన్నమయ్య జిల్లా, సుండుపల్లె మండలానికి చెందిన రమేష్‌నాయుడు(55) తిరుపతి నుంచి తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. అదేసమయంలో పీలేరు నుంచి తిరుపతి వైపు హిటాచీని తీసుకుని వెళుతున్న లారీ రాజువారిపల్లె మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో రమేష్ నాయుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు వ్యవసాయం, చిన్నచిన్న కాంట్రాక్టు పనులు చేసుకునేవాడు. ఈ మేరకు భాకరాపేట పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఓవరాల్ చాంపియన్ విజయవాడ ట్రాన్స్‌కో


విజయవాడ ట్రాన్స్‌కో క్రీడాకారులు

తిరుపతి రూరల్: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ ఉమెన్ గేమ్స్ – కల్చరల్ కాంపిటిషన్ టోర్నమెంట్ 2022–23 గురువారం ముగిసింది. ఇందులో విజయవాడ ట్రాన్స్‌కో సర్కిల్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ టి.భారతి (విద్యుత్ సౌధ, విజయవాడ), ఓవరాల్ చైర్మన్ ట్రోఫీని ఏపీ ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ జట్టు దక్కించుకుంది. బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, టేబుల్ టెన్నిస్, షటిల్, చెస్, క్యారమ్స్, లాంగ్ జంప్, టగ్ ఆఫ్ వార్, పోటీల్లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఉద్యోగులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇక సాంస్కృతిక పోటీల్లో బెస్ట్ ప్లేలెట్ బృందంగా ఏపీ జెన్కో, లోయర్ సీలేరు జట్టు నిలిచింది. విజేతలకు ఎస్పీడీసీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ శివప్రసాద్‌రెడ్డి బహుమతులు అందజేశారు. టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని ఆడిటోరియంలో జరిగింది. తిరుపతి సర్కిల్ స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వాసుదేవరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వాసురెడ్డి, సురేష్, రెడ్డెప్ప, సుబ్బారావు, స్పోర్ట్స్, గేమ్స్ కార్యదర్శి పురుషోత్తం, సాంస్కృతిక కార్యదర్శి జయచంద్ర పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత మృతికి ఎమ్మెల్యే నివాళి


ఉమాకాంత్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

పాకాల: మండలంలోని పెదబైనపల్లి పంచాయతీ దాసర్లపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కత్తి ఉమాకాంత్‌రెడ్డి(41) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గురువారం దాసర్లపల్లికి చేరుకున్నారు. ఉమాకాంత్‌రెడ్డి భౌతికదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఉమాకాంత్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, ఎంపీపీ లోకనాథం, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, హరికృష్ణారెడ్డి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న బలిజ భవన్ పరిరక్షణ పనులు


బలిజ భవన్ పరిరక్షణ పనులను చేపడుతున్న బలిజ, కాపు సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చొరవతో బలిజ భవన్ పరిరక్షణ పనులు వేగంగా సాగుతున్నాయి. బలిజ జేఏసీ అధ్యక్షుడు నీలం బాలాజీ, కాపు సంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పనులు చేస్తున్నారు. ఈ పనులను గురువారం ప్రభుత్వ ఉన్నతాధికారులు పరిశీలించారు. పనుల నిర్వహణలో బలిజ నేతలు ఆళ్వార్ మురళి, సుబ్రమణ్యం ఉన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


ట్యాబ్‌లు అందజేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: పద్మావతి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులకు గురువారం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి టాబ్‌లు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని గుంటూరు, తిరుపతి ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం యూనిసెఫ్ సహకారంతో ట్యాబ్‌లు అందజేసినట్టు కలెక్టర్ తెలిపారు. వైద్య రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకుని సామాన్య ప్రజలకు మంచి వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్టడీ మెటీరియల్ కలిగిన ట్యాబ్‌లు పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. నర్సింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న 30 మంది విద్యార్థులు, పది మంది అధ్యాపకులకు ట్యాబ్‌లు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రోజా, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శ్రీహరి, ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ పార్థసారథి పాల్గొన్నారు.

సూపరింటెండెంట్ రవికి అభినందనలు


రవిని సత్కరిస్తున్న కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి తుడా: కాంబోడియాలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ సదస్సులో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ప్రతినిధిగా పాల్గొన్న సూపరింటెండెంట్ రవిని గురువారం కమిషనర్ అనుపమ అంజలి, అధికారులు అభినందించారు. ఆయనను సత్కరించారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టించడం ఎలా అనే అంశంపై ఆయన అంతర్జాతీయ సదస్సులో ప్రజెంటేషన్ చేశారు. జపాన్ ప్రభుత్వం కాంబోడియాలో నిర్వహించిన ఈ సదస్సులో 35 దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళేశ్వరరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, రెవెన్యూ ఆఫీసర్ లోకేశ్వరవర్మ, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం ఏర్పాట్లపై జేఈవో సమీక్ష


మహిళా దినోత్సవంపై సమీక్షిస్తున్న జేఈవో

తిరుపతి అలిపిరి: టీటీడీ ఆధ్వర్యంలో మార్చి 8న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పాట్లపై జేఈఓ వీరబ్రహ్మం గురువారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ టీటీడీ మహిళా అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్గనైజింగ్, స్పీకర్స్, పర్చేజ్, కల్చరల్, ఇన్విటేషన్, ఫుడ్ కమిటీల విధులు, బాధ్యతలను తెలియజేశారు. పద్మావతి అవార్డుల కోసం అర్హులైన వారిని ఎంపిక చేయాలని సూచించారు. కోవిడ్ సమయంలో విశేష సేవలు అందించిన టీటీడీ వైద్య సిబ్బందికి కూడా ఈ ఏడాది అవార్డులు అందజేయనున్నట్టు తెలిపారు. ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీదేవి, డెప్యూటీ ఈవోలు స్నేహలత, శాంతి, నాగరత్న, పద్మావతి, జగదీశ్వరి, భారతి, సెంట్రల్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కుసుమకుమారి, ఆయుర్వేద కళాశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రేణు దీక్షిత్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణమ్మ, మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అశుంత పాల్గొన్నారు.

శివరాత్రికి జీవలింగేశ్వర స్వామి ఆలయం ముస్తాబు


జీవలింగేశ్వరస్వామి ఆలయంలో చేపట్టిన ప్రత్యేక ఏర్పాట్లు

తిరుపతి మంగళం: జీవకోనలోని జీవలింగేశ్వర స్వామి ఆలయాన్ని శివరాత్రి పండుగకు ముస్తాబు చేశారు. ఆలయ ధర్మకర్త సురేంద్రకుమార్‌రెడ్డి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం అర్ధరాత్రి 12 గంటలకు జీవలింగేశ్వరస్వామికి మహా రుద్రాభిషేకం, ఆదివారం అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థంకు వచ్చే భక్తులకు శివరాత్రి రోజున ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నప్రసాదాలను పంపిణీ చేస్తామన్నారు.